## జిల్లాలో అగ్ని ప్రమాదాలను నివారిద్దాం.

### కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ.



**మచిలీపట్నం ఏప్రిల్14 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జిల్లాలో అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారించుటకు ప్రజలను చైతన్య పరచాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నగరంలోని రేవతి సెంటర్ వద్ద గల అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించి ఈ నెల 14 నుండి 20 వ తేదీ వరకు నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు. కలెక్టర్ అగ్ని ప్రమాదాల నివారణ పై ప్రజలను చైతన్య పరిచే కరపత్రాలను, గోడపత్రాలను విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలను నివారించుటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ఆపద సమయాలలో ప్రజల ప్రాణాలను రక్షించడంలో అగ్నిమాపక సిబ్బంది పాత్ర ఎంతో కీలకమన్నారు. అగ్ని ప్రమాద కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఉపయోగించే పలు పరికరాలు జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి ఏసురత్నం, ఏడి ఎఫ్ ఓ ఆనం రమణారెడ్డి, లీడింగ్ ఫైర్ మాన్లు వెంకటేశ్వరరావు, జకరయ్య తదితర అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ అందరికీ ఆరాధ్యుడు

### మాజీ మంత్రి పేర్ని నాని.




**మచిలీపట్నం ఏప్రిల్14 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందరికీ ఆరాధ్య దైవం అని, ఆయన వల్లే అందరం సమ స్థాయిలో నిలబడగలుగుతున్నామని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు. అంటరానితనం ఉండకూడదు పక్షపాత ధోరణి ఉండకూడదు అనేది అంబేద్కర్ సృష్టించిన మార్గం అని అంబేద్కర్ అంటే దళిత వర్గానికే ఆరాధ్యుడు కాదని, అందరికీ ఆరాధ్యుడు అని అన్నారు. అసమానతకు గురైన ప్రతి మనిషికి, ఆడవారికి కూడా సమాన హక్కులు వచ్చాయంటే ఆయన నాటిన విత్తనం వల్లే వచ్చిందన్నారు. సంఘంలో ఈవేళ అందరూ సమస్థితిలో గర్వంగా తలెత్తుకుని బతుకుతున్నారు అంటే అది అంబేద్కర్ ప్రసాదించిన రాజ్యాంగం వల్లనేనని అన్నారు. చదువు యొక్క విలువ తెలిపి అందరూ చదవాలి అందరూ ఎదగాలి అనేది ఆయన సంకల్పం అన్నారు. అలాంటి మేధావి ఎన్నో ప్రజోపయోగకర పనులు నిర్వర్తించి అందరికీ ఆరాధ్య దైవం అయినారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి నాయకులు కార్యకర్తలు పాల్గొని అంబేద్కర్ కు ఘన నివాళులర్పించారు.

## ఈనెల 17న అవనిగడ్డలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు జాబ్ మేళా.!

### నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.



**మచిలీపట్నం ఏప్రిల్14 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు గాను ఈ నెల 17 వ తేదీ శుక్రవారం ఉదయం 09:00 గంటలకు అవనిగడ్డలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు “జాబ్ మేళా” నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో టాటా ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఎన్ఎస్ ఇన్స్ట్రుమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, కోల్గేట్-పల్మోలివ్ లిమిటెడ్, అపోలో టైర్స్ లిమిటెడ్, ముత్తూట్ మనీ లిమిటెడ్, ఎయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్, మెడ్ప్లస్ ఫార్మసి, మోహన్ స్పింటెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, పేటిఎమ్ సర్వీసెస్ లిమిటెడ్, సుధీర్ గ్రూప్ వంటి ప్రముఖ కంపెనీల వారు పాల్గొంటున్నారని, 600కు పైగా వివిధ ఉద్యోగాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్ కుమార్ తెలిపారు. ఈ కంపెనీలలో గల ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, ఫార్మసి పూర్తిచేసిన 18 నుండి 35 సంవత్సరాల లోపు యువత అర్హులని, ఎంపిక అయిన వారికి మంచి వేతనము మరియు ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు కలవని, ఏప్రియల్ 17న నిర్వహించబోయే జాబ్ మేళాకు హాజరయిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం ద్వారా సదరు ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

ఆసక్తి తగిన అర్హతలు గల అభ్యర్థులు ముందుగా https://naipunyam.ap.gov.in వెబ్సైట్ నందు తప్పనిసరిగా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ కావడంతోపాటు, సదరు జాబ్ మేళాకు రెస్యూమ్ లతో లేదా బయోడేటా ఫోరమ్ లతో పాటు ఆధార్, ఆధార్ కు లింక్ అయిన ఫోన్ నంబర్, పాన్ సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో రావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 63006 18985, 79955 34572 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## సచివాలయాలా!?వేడుకల నిలయాలా!?

### కొంతమంది టిడిపి ఇన్చార్జుల అత్యుత్సాహం.

### 46వ డివిజన్లో ఇంచార్జ్ కి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించిన సిబ్బంది.

### ఇబ్బందుల పాలవుతున్న ప్రజానీకం.



**మచిలీపట్నం ఏప్రిల్14 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఎవరైనా వేడుకలు చేసుకోవచ్చు. ఉత్సవాలు నిర్వహించుకోవచ్చు. జన్మదినాలు జరుపుకోవచ్చు. కానీ దానికి కూడా హద్దు పద్దులు ఉంటాయి. ఏ వేడుకైనా ప్రైవేట్ గా వ్యక్తిగతంగా నిర్వహించుకోవాలి కానీ, పబ్లిక్ పార్టీగా సచివాలయాల్లో నిర్వహించి నవ్వుల పాలు కాకూడదు. అంతా మా ఇష్టం, సర్వం మాదే, అనే తంతుతో కొంతమంది తెలుగుదేశం పార్టీ సచివాలయ ఇన్చార్జులు తామే బిగ్ బాస్ లు అన్నట్లుగా వ్యవహరిస్తూ అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ప్రజల్లో నవ్వుల పాలవుతున్నారు. సచివాలయాలు అనేవి ప్రజలకు సేవలు అందించే కేంద్రాలు. బర్త్ సర్టిఫికెట్లు ఇవ్వాలన్నా, టాక్స్ లు కట్టించుకోవాలన్నా, ఆ డివిజన్లో మంచి నీటి సమస్య లేకుండా చూడాలన్న, శాంతిభద్రతలను పరిరక్షించాలన్న, డివిజన్ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్న సచివాలయ సిబ్బంది అంకితభావంతో విధి నిర్వహణ చేయాలి. కానీ కొంతమంది సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శించి డివిజన్ ఇన్చార్జిలు చెప్పిందే వేదం, అన్నట్లుగా వాళ్లు చెప్పినట్లుగానే నడుచుకుంటున్నారు. దానివల్ల సచివాలయ వ్యవస్థ తీరుతెన్నులు దెబ్బతింటున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. సచివాలయాలు అనేవి ప్రజా సమస్యల పరిష్కార వేదికలుగా పని చేయాలి. ప్రజల ముంగిటకే పాలనను అందించే సంక్షేమ నిలయాలు సచివాలయాలు. నిరంతరం ప్రజల సంక్షేమం కోసం ఉద్దేశించిన సచివాలయాలు నేడు జన్మదిన వేడుకలకు, నిలయాలుగా మారాయని ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. తాజాగా 46వ డివిజన్ సచివాలయ ఇంచార్జ్ గండికోట అంజిబాబు జన్మదిన వేడుకలు 46వ డివిజన్ సచివాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. యావత్ కార్యాలయ సిబ్బంది, వీఆర్వో సైతం ఈ వేడుకల్లో పాల్గొని ఆయనపై స్వామి భక్తి ప్రదర్శించారు. ఇది అభినందించ దగ్గదే అయినా, కార్యాలయ వేళల్లో ఇలాంటి అచ్చట్లు,ముచ్చట్లు జరపడం తగునా? అని ప్రశ్నిస్తున్నారు.

ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కొంతమంది డివిజన్ ఇంచార్జిలు: నగరంలో కొంతమంది తెలుగుదేశం పార్టీ డివిజన్ ఇన్చార్జులు తాము చెప్పిందే వేదం, తమ మాటే వినాలి, తమకు తెలియకుండా ఏ విషయం, చివరికి ఏ ఫైలు కదలకూడదు.. అనే రీతిలో సిబ్బందిపై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, దీనితో సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని గుసగుసలు వినపడుతున్నాయి. ఇప్పటికైనా అధినాయకత్వం ఇలా అత్యుత్సాహం ప్రదర్శించే ఇన్చార్జులను గుర్తించి పట్టపగ్గాలు లేకుండా దూకుడుగా వ్యవహరించే కొంతమంది తెలుగుదేశం పార్టీ డివిజన్ ఇంచార్జ్ లకు బ్రేకులు వేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, నగర ప్రజలు అనుకోవడం గమనార్హం. కొంతమంది డివిజన్ ఇన్చార్జిలు చేస్తున్న ఇలాంటి పనుల వల్ల తెలుగుదేశం పార్టీ ప్రతిష్టకు భంగం కలుగుతోందని ప్రజానీకం వాపోతున్నారు. ఇప్పటికైనా మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డీకే బాలాజీ ఈ విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టి నగరంలోని సచివాలయాలను సంస్కరించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ముమ్మందు ఇలాంటి వేడుకలు సచివాలయాల్లో నిర్వహించకుండా కట్టడి చేయాలి. ఇటీవల కలెక్టర్ కూడా కొన్ని సచివాలయాల పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేసినట్లుగా తెలిసింది. ఇలాంటి సచివాలయాలను తక్షణం సంస్కరించవలసిన బాధ్యత అధికారులపై ఉంది.

అంతేగాక సిబ్బంది కూడా స్వామి భక్తి ప్రదర్శించి, ఇన్చార్జిల స్వీయ పనులు చేయకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తే సచివాలయాలు సస్యశ్యామలంగా విలసిల్లుతాయి.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్.!

### - సామాన్య కుటుంబం నుండి అసమాన్య శక్తిగా ఎదిగారు.

### - ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన రాజ్యాంగాన్ని దేశానికి అందించారు.

### - విద్యతోనే సమాజంలో అసమానతలు తొలగించొచ్చని నమ్మారు.

### - మచిలీపట్నం లక్ష్మీ టాకీస్ సెంటర్లో ఘనంగా అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు



**మచిలీపట్నం ఏప్రిల్14 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మహనీయుడు డా.బి.ఆర్. అంబేద్కర్ అందించిన రాజ్యాంగం కారణంగానే నేడు దేశంలోని బడుగు బలహీన వర్గాల ప్రజలు అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నంలోని లక్ష్మీ టాకీస్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా పరిషత్ కన్వెన్షన్లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ అంబేద్కర్ ని ఒక కులానికో, ప్రాంతానికో పరిమితం చేయడం సరికాదని, దేశంలోని బడుగు బలహీన వర్గాల ప్రజలంతా అంబేద్కర్ వారసులేనన్నారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగం కారణంగానే ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారన్నారు. హక్కులు పొందుతున్నారు. పూలే లాంటి ఎంతో మంది మహనీయులు సామాజిక అవసమానతలపై పోరాటం చేశారు. వారి బాటలోనే అంబేద్కర్ నడిచారన్నారు. విద్య ద్వారా మాత్రమే అసమానతల నిర్మూలన సాధ్యమని భావించి ఉన్నత చదువులు చదువుకున్నారన్నారు. దేశంలోని ప్రతి ఒక్కరికీ విద్య సహా అన్ని హక్కులు అందాలని ఆకాంక్షించారన్నారు. రాజ్యాంగ రచనకు వచ్చిన అవకాశాన్ని బడుగు బలహీన వర్గాల వారి బతుకుల్లో వెలుగులు నింపడం కోసం ప్రత్యేక ప్రాధాన్యమి చ్చారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అనేక దేశాల రాజ్యాంగాలను పరిశీలించి దేశంలో ఉన్న విభిన్న కుల, మత, ప్రాంతాల్లోని వారికి న్యాయం చేసేలా రాజ్యాంగం రచించారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో మనకంటే ముందు నుండి రాజ్యాంగాలు ఉన్నప్పటికీ నేడు అనేక అనిశ్చితులు ఎదుర్కొంటు న్నాయన్నారు. కానీ మన దేశంలో మాత్రం ఇప్పటికీ పటిష్టంగా నిలబడ్డామంటే దానికి కారణం అంబేద్కర్ అని మంత్రి రవీంద్ర అన్నారు. పాలకులు తప్పు చేసినా ప్రజలు ఎప్పుడూ రాజ్యాంగం పట్ల విశ్వాసంతో ఉంటారన్నారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రజల హక్కుల్ని అణచివేయాలని ప్రయత్నించినా ప్రజలు ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టారన్నారు. గతంలో ప్రభుత్వాలు ప్రజలు, ప్రతిపక్షాల ను అణచివేసేందుకు ప్రయత్నించినా ప్రజలు కాపాడుకున్నార న్నారు. గత ఐదేళ్ల పాలనా కాలంలో అనుసరించిన దుర్మార్గపు విధానాలను ఎదిరించి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారన్నారు. ఇప్పటికీ కొన్ని అసమానతలు మన సమాజంలో ఉన్నాయి. ప్రతి ఒక్కరు కూడా మరొకరికి చేయూత అందించినపుడే అసమానతలు తొలగిపోయి అంబేద్కర్ కోరిన సమాజం సాకారమవుతుం దన్నారు. రాష్ట్రంలో నందమూరి తారకరామారావు పార్టీ ఏర్పాటుతో బడుగు బలహీన వర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అనేక మార్పులు తీసుకొచ్చారన్నారు. లోక్సభ స్పీకర్గా బాలయోగిని, శాసనసభ స్పీకర్గా కావలి ప్రతిభా భారతి ని ఎంపిక చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదే అని అన్నారు. సామాన్య పౌరులు కూడా అసమాన్య హక్కులు పొందేలా చేసిన ఘనత అంబేద్కర్ దే అని మంత్రి అన్నారు. అంతటి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్ కి ఘనంగా నివాళి అర్పిస్తున్నా మన్నారు. మచిలీపట్నంలో అంబేద్కర్ భవనం నిర్మాణానికి గతంలో శ్రీకారం చుట్టామన్నారు. త్వరలోనే ప్రారంభించుకుని పూర్తి చేస్తానన్నారు. అవసరమైన మేరకు సీ ఎస్ ఆర్ ఫండ్స్ కూడా తీసుకొస్తామని మంత్రి రవీంద్ర పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డి.కె.బాలాజీ , ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారయణ రావు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

### పాల్గొన్న కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ తదితరులు.

**మచిలీపట్నం ఏప్రిల్14 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కానూరు లో స్వర్ణ గ్రామ కార్యాలయం నందు చిన్న కానూరు గ్రామము నందు డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలలో తెలుగుదేశం పార్టీ ప్రదాన కార్యదర్శి గోపు సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ఏప్రిల్ 14వ తేదీ 1891 లో మధ్యప్రదేశ్ లోని మోవ్ అనే గ్రామంలో జన్మించారని తెలిపారు.ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14న అంబేద్కర్ జన్మదినాన్ని పురస్కరించుకొని అంబేద్కర్ జయంతిగా జరుపుకుంటామని అని తెలియజేసారు. ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆశాజ్యోతి, భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా. బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించుకుంటాం అన్నారు. “విద్య, సంఘటితం, పోరాటం” అనే మంత్రంతో కోట్లాది మందిలో చైతన్యం నింపిన యుగపురుషుడు కులవివక్ష చీకట్లను చీల్చి, సమానత్వ సూర్యుడిని ఆవిష్కరించిన మహామేధావి అంబేద్కర్ అన్నారు. ఆయన కలలు కన్న సమసమాజ స్థాపనకు మనమంతా కృషి చేద్దాం. రాజ్యాంగం మనకిచ్చిన హక్కులను తెలుసుకుని, బాధ్యతలను నిర్వర్తిద్దాం అన్నారు. అంబేద్కర్ బాటలో నడుద్దాం అని తెలిపారు. పంచాయతీ సెక్రటరీ వర ప్రసాద్, సుబ్బయ్య దాస్ వీ ఆర్ ఓ , దివి మహేష్, పీత రాము, గోపు వెంకటరమణ, బొల్లిశెట్టి నాని, గొవ్వాడ లక్ష్మణ, కమ్మగంటి అశోక్, కూరెళ్ళ వీర్రాజు, రాంబాబు,ఆముదాలపల్లి వెంకటేశ్వరావు, బోట్ల రాజేష్,శీలం శేషుబాబు, విజయ్ , కమ్మగట్టి



వెంకటేశ్వరావు, స్వర్ణ గ్రామ సిబ్బంది, బుక్ కీపర్స్ అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.వెంకట మోహన్ రావు పర్యవేక్షణ చేశారు. స్వామి వారిని దర్శించి పూజలు నిర్వహించి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## గ్యాస్ కొరతతో విలవిలలాడుతున్న జనం.

### ఇప్పటికీ కట్టెల పొయ్యి మీదే జీవనం కొనసాగింపు.

### గ్యాస్ కంపెనీల మాయాజాలానికి ప్రజలు విలవిల.



**మచిలీపట్నం ఏప్రిల్14 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఇందు గలదు అందులేదని ఎందెందు వెతికి చూసినా అవినీతే రాజ్యం ఏలుతోందని జగమెరిగిన సత్యం. బ్లాక్ మార్కెట్ కి తరలిపోతున్న గ్యాస్ సిలిండర్లు చోద్యం చూస్తున్న అధికారులతో సామాన్య జనం సతమతమవుతున్నారు. గ్యాస్ బండ గుదిబండలా మారింది. తెల్లవారుజాము నుండి గ్యాస్ కంపెనీల వద్ద లైన్లలో నుంచోడం, బండ సాధిస్తే ఏదో సామ్రాజ్యం సాధించినట్లుగా విజయ దరహాసంతో ఇంటికి వెళ్లడం, సాధించకపోతే యుద్ధంలో సర్వం కోల్పోయిన వాడిలాగా దీనంగా ఇంటికి తిరిగి రావడం ఇది నగరంలో నిత్య కృత్యం అయిపోయింది. ప్రభుత్వం గ్యాస్ బండను గ్రామీణ ప్రాంతాలలో 35 రోజులకు, పట్టణ ప్రాంతాల్లో 25 రోజులకు బుక్ చేసుకోవాలని సూచించింది. కానీ వాస్తవ పరిస్థితులు దానికి భిన్నంగా ఉన్నాయి. గ్యాస్ సకాలంలో బుక్ చేసుకున్నప్పటికీ నగరంలో చాలా వరకు గ్యాస్ బండలు బ్లాక్ మార్కెట్లో అమ్ముడు అవుతున్నాయి అనేది యదార్థ సత్యం. వెయ్యి రూపాయల లోపు ఉండే వంట గ్యాస్, 4000 ఇచ్చి కొనడానికి కూడా నగర ప్రజలు సిద్ధంగా ఉన్నారు అంటే బ్లాక్ మార్కెట్ దందా ఎంత దారుణంగా నడుస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఎక్కడ చూసినా అవినీతి తాండవిస్తోంది. దీనికి బలి అయిపోయేది సామాన్య ప్రజానీకమే. మచిలీపట్నం లో గ్యాస్ డీలర్లు, వర్కర్లు మాయాజాలం.

నగరంలో గ్యాస్ డీలర్లు వర్కర్లు సైతం గ్యాస్ కొరతను అడ్డం చూపిస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారు. లేని కొరతను సృష్టిస్తూ తమ జేబులు నింపుకుంటున్నారు గ్యాస్ కొరతను క్యాష్ చేసుకుంటున్న ఆఫీస్ లోని దళారులు ఒక్కో గ్యాస్ సిలిండర్ 4 వేల రూపాయల చొప్పున బ్లాక్ మార్కెట్ లో సాక్షాత్తు కంపెనీ ఉద్యోగుల విక్రయిస్తున్నారంటే దందా ఎంత దర్జాగా నడుస్తుందో అర్థం చేసుకోవచ్చు. సివిల్ సప్లై అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. నీకెంత, నాకెంత, అనే రీతిలో వ్యవహారాలు గుట్టుగా కొనసాగుతున్నాయని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ఎవరి చేతి వాటం వారిది, ఎవరి సంపాదన వారిది అన్నట్లుగా తయారైంది లోకం పోకడ. ఎవరి లాభం వారిది అన్నట్లుగా ఇలాంటి అవకాశం మళ్ళీ రాదు అని గ్యాస్ బండను అడ్డం పెట్టుకొని ఫుల్ గా క్యాష్ చేసుకుంటున్న వైనం సామాన్యులకు గుదిబండగా మారింది. ఎన్ని ఫిర్యాదులు చేసినా సంబంధిత అధికారులు గ్యాస్ కంపెనీల వైపు కన్నెత్తి చూడట్లేదని, ఈ బ్లాక్ మార్కెట్ దందాను నిలువరించలేకపోతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్యాస్ సప్లై చేసే బాయ్ దగ్గర నుండి ఆఫీసు లో పనిచేసే ఉద్యోగుల వరకు ఈ దందాలో భాగస్వాములే అనేది సమాచారం. సామాన్యులకు ఈ బ్లాక్ మార్కెట్ వ్యవహారం తీవ్ర తలనొప్పిగా మారింది. సకాలంలో సిలిండర్లు అందక నగర ప్రజలు నానాయాతనలు పడుతున్నారు. పైకి మాత్రం గ్యాస్ కొరత లేదంటున్నారు కానీ ప్రజలు నిత్యం గ్యాస్ కొరతతో సతమతం అవుతున్నారు. మమల్ని పట్టించుకునే నాథుడు లేరంటూ నగర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి నగరంలో కృత్రిమంగా సృష్టిస్తున్న గ్యాస్ కొరతకు అడ్డుకట్ట వేసి, దళారుల దోపిడీని నిరోధిస్తారని నగర ప్రజలు ఆశిస్తున్నారు.

## ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు.!



**మచిలీపట్నం ఏప్రిల్14 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** స్థానిక పరాసుపేటలో వేంచేసియున్న శ్రీ సువర్చలా సమేత అభయాంజనేయ స్వామి దేవాలయం నందు రెండవ మంగళవారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు అలంకరణలు, నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ భక్తబృందంచే 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు.అనంతరం అన్న సమారా ధాన కార్యక్రమంలో వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో తిట్టి శెట్టి వీర వెంకట మోహన్ రావు పర్యవేక్షణ చేశారు. స్వామి వారిని దర్శించి పూజలు నిర్వహించి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## గోవుల అక్రమ రవాణా అడ్డుకున్న గో ప్రేమికుడు



**మచిలీపట్నం ఏప్రిల్14 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గోవుల అక్రమ రవాణాను గో ప్రేమికుడు జన్ను వెంకట గణేష్ అడ్డుకున్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీసులు గోవులను గోశాలకు తరలించారు. మచిలీపట్నం లో ఏపీ 39 డబ్ల్యూ డిబి 3506 వాహనంలో 10 నందులను, 3 ఆవు దూడలను అత్యంత కిరాతముగా కాళ్ళను మెడను ఒకే తాడుతో కట్టి ఆహారం, నీళ్లు లేకుండా గాలి ఆడకుండా కుక్కి వేసిన హృదయ విదారక సంఘటన ప్రేమికులను కలచివేసింది. తాళ్లతో బంధించిన గోవులను తుని నుండి గుంటూరుకు అక్రమంగా రవాణా చేస్తున్నట్టు తెలిసింది. వాహనాన్ని పెడన రోడ్డులో హర్ష కాలేజీ దగ్గర పట్టుకుని పోలీసులకి గో ప్రేమికుడు జన్ను వెంకట గణేష్ వారి సభ్యులు తాలూకా పోలీస్ స్టేషన్లో అప్పగించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఆవు దూడలను పోలీసులు గోశాలకు తరలించారు ఈ సందర్భంగా గోవుల అక్రమ రవాణా ను పూర్తిగా అరికట్టేలా సహకరించాలని ప్రతి హిందువును హిందూ సంఘాలను జన్ను వెంకట గణేష్ కోరారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.) and Printed at SKYLINE PRESS, D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.), Associate Editor : K. Neeraja, Ph: 0866-2411299. E-mail: netimanadesam.vja@gmail.com